క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



మహాముత్తారం: మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ నాయక్ గురువారం రాత్రి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ మెండ వెంకటస్వామి, సర్పంచ్ రత్నం బక్కయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

బూత్ కమిటీల సమావేశం



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని వేశాలపల్లి, జంగేడు, పక్కీర్‌గడ్డ గ్రామాల్లో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలకు తమిళనాడు రాష్ట మైలదుతరై జిల్లా ఉపాధ్యక్షుడు సెంథిల్‌కుమార్ హాజరై కమిటీలను పర్యవేక్షించినట్లు మధుసూదన్ తెలిపారు. ఈకార్యక్రమంలో బూత్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన ఇందారపు లక్ష్మి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.18వేల విలువ గల చెక్కు మంజూరైంది. ఈ మేరకు పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం లబ్ధిదారురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, సర్పంచ్ సుంకరి సత్తయ్య, నాయకులు కోట రవి, బూడిద మల్లేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవర్నే రాజేశ్వర్‌రావు, సాంబయ్య, సదానందం, రవి, సతీష్, శారద పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన

వాజేడు: పౌరులు హక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ అన్నారు. మండల పరిధిలోని పేరూరులో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరులు తమ హక్కుల ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో పాటు రాజ్యాంగంపై అవగాహన ఉండాలన్నారు. ఈ సందర్భంగా చట్టాల గురించి అవగాహన కల్పించారు.

బీఆర్‌ఎస్ నాయకులకే నష్టపరిహారం



వెంకటాపురం(ఎం): అకాల వర్షాలతో నష్టపోయిన పంటల నష్ట పరిహారం రైతులకు అందించాల్సి ఉండగా, బీఆర్‌ఎస్ నాయకులకు మాత్రమే పరిహారం డబ్బులు అందాయని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో కార్యక్రమంలో ఆయన కార్యకర్తలను ద్దేశించి మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి అన్నదాతలు పంటలు పండిస్తే అకాల వర్షాలు నట్టేట ముంచాయని, ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు చెల్లిస్తామని చెప్పినప్పటికీ రైతుల ఖాతాల్లో డబ్బులు జమకావడం లేదన్నారు. నష్ట పరిహారం బీఆర్‌ఎస్ నాయకుల ఖాతాల్లోనే జమ అవుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, ప్రేమ్‌సింగ్, బ్రహ్మచారి, సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రయోజనకరం

వెంకటాపురం(కె): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలు ప్రజలకు ప్రయోజనకరమైనవని బీజేపీ మండల విస్తారక్ అవినాష్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ గొల కోటి త్రినాథ్‌రావు, మండల విస్తారక్ అవినాష్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రజా ఉపయోగ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. రెండుసార్లు మోదీ హయాంలో కేంద్రంలో బీజేపీ అధికా రంలోకి వచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ప్రజలు అందరు సహకరించాలని కోరారు. మండల అధ్యక్షుడు రఘురామ్, లక్ష్మిపతి, సుందర్, ప్రసాద్ ఉన్నారు.

తప్పని తాగునీటి కష్టాలు



హనుమాన్ దేవాలయం వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు



ట్రాక్టర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

- కిష్టాపూర్‌లో రెండు నెలలుగా కాలిపోయిన బోరు మోటారు
- ట్రాక్టర్ల, ఎడ్ల బండ్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు



పాడైపోయిన బోరు

మహాముత్తారం: మండలంలోని నల్లగుంటమీనాజీపేట గ్రామపంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన కిష్టాపూర్ గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు నానాతంటాలు పడుతున్నారు. తాగునీటి కోసం డ్రమ్ములను ట్రాక్టర్లలో వేసుకుని సుదూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి గ్రామంలో నెలకొంది. స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకులను నింపాలంటే నడవాల్సిన మోటార్ బోరు రెండు నెలల క్రితం కాలిపోయింది. గ్రామ పంచాయతీలో నిధులు లేకపోవడంతో మోటారు రిపేరు చేయడం లేదని సర్పంచ్ తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు నెలలుగా గ్రామప్రజలు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి, గ్రామసమీపంలోని హనుమాన్ దేవాలయం వద్ద ఉన్న నీటిని ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ ట్రాలీలో ప్లాస్టిక్ డ్రమ్ములను ఏర్పాటు చేసుకుని వాటిలో తాగునీటిని తెచ్చుకుని వినియోగిస్తున్నారు. గ్రామంలో 300 జనాభా, 120 ఇళ్లు ఉన్నాయి. తాగునీటిని సుదూర ప్రాంతం నుంచి తెచ్చుకోవడం తమకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు, మహిళలు పేర్కొంటున్నారు.

పనిచేయని మిషన్ భగీరథ

ఇంటింటికీ నీరందించే మిషన్ భగీరథ గ్రామంలో సరిగా పని చేయడం లేదని ఒకవేల అది పనిచేసినా ఇంటికి రెండు, మూడు బిందెలు మాత్రమే వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బావుల కాడా కూడా త్రీఫెజ్ కంరెట్ సరిగా ఉండకపోవడంతో అక్కడి నుంచి నీటిని తెచ్చుకోలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు తాగునీరు అందించాలని కోరుతున్నారు.

> **నిధులు లేక రిపేరు చేయలే..**
>
> గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో చెడిపోయిన మంచినీటి బోరు బావి మోటార్ రిపేరు చేయడానికి పంచాయతీలో నిధులు లేవు. ఎలాగైన త్వరలో మోటార్ రిపేరు చేసి గ్రామస్తులకు నీటిని సరఫరా చేస్తామన్నారు.
>
> - సర్పంచ్ రాజు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కేటీకే 6వ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం గని మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచీ కార్యదర్శి మోటపలుకుల రమేష్ మాట్లాడుతూ.. గని ఆవరణంలో కోతుల బెడద నివారించాలని, గరిమికోట్ తెప్పించాలని కోరారు. 1 సీమ్ నూతన ట్రిపులర్ ఏర్పాటు చేయాలని, క్యాంటిన్‌ను సింగరేణి యాజమాన్యమే నడిపించాలన్నారు. నాణ్యత కలిగిన డ్రిల్ బిట్స్ రాడ్లు తెప్పించాలని కోరారు. కార్మికులు, నాయకులు చంద్రమౌళి, కృష్ణమూర్తి, శ్రీను, తిరుపతి,గోవర్ధన్, కృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి

భూపాలపల్లి అర్బన్: వానాకాలం నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్దు అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పట్టణంలో అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. దోమల బెడద, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. పిచ్చి కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉన్నందున వాటిని పట్టించి దూర ప్రాంతాలకు తరలించాలని పాలకవర్గం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. రాబోయే వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ హరిబాబు, ఇన్‌చార్జ్ కమిషనర్ అనిల్‌కుమార్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

ములుగు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల కన్వీనర్‌గా మండలంలోని పత్తిపల్లి గ్రామానికి చెందిన గుండారపు వైకుంఠంను నియమించినట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ బట్ట మురళీకృష్ణా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో వైకుంఠంకు నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం యూత్ జిల్లా కన్వీనర్ తోటకూరి శ్రీకాంత్, నాగేశ్వర్‌రావు, ఏడుకొండలు ఉన్నారు.

హక్కుల కోసం కొట్లాడుతాం..



అంబేడ్కర్‌సెంటర్‌లో దీక్ష చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం.. వారి హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై కొట్లాడుతామని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి పరిరక్షణ హక్కుల సాధన కోసం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద శుక్రవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అప్పం కిషన్ మాట్లాడుతూ.. తొమ్మిది సంవత్సరాలుగా కేసీఆర్ పాలనలో కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలతో సింగరేణిలో అపరిమిత జోక్యంతో కార్మిక వర్గం తీవ్ర కష్టనష్టాలను అవమానాలను ఎదుర్కొంటుదన్నారు. ఇప్పటికైనా కార్మిక సమస్యలు సింగరేణి యాజమాన్యం, తెలంగాణ రాష్ట ప్రభుత్వం కలిసి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో కార్మికులతో కలిసి మరిన్ని ఉద్యమాలు చేపట్టి కార్మిక హక్కులను సాధిస్తామన్నారు. ఆదాయ పన్నును పూర్తిగా రద్దు చేయాలని, కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని కోరారు. మారుపేరుతో పనిచేస్తున్న కార్మికులకు సవరణ చేయాలని, సింగరేణి ఆస్పత్రులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా మార్చాలని డిమాండ్ చేశారు. కారుణ్య నియామకాల్లో మెడికల్ దందాపై చర్యలు తీసుకోవాలని కోరారు. 46మంది డిస్మిస్ కార్మికులను ఉద్యోగంలోకి తీసుకోవాలన్నారు. అధికారులపై పని ఒత్తిడి భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాక్కమ్ సదయ్య, అబ్బాస్, కుమార్, నరేష్, శేఖర్, సుదర్శన్, రమేష్, రాజ్ కుమార్, బద్రీనాథ్, సుధాకర్, భీష్మాచారి, ప్రభాకర్, అరవింద్ పాల్గొన్నారు.

గ్రూప్‌-4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



కాటారం: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం: గ్రూప్ 4 పరీక్షల నిర్వహణకు పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను శుక్రవారం కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. కాటారం ప్రభుత్వ హై స్కూల్, ఆదర్శ పాఠశాల, గంగారం మోడల్ స్కూల్, కొత్తపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల పరీక్షా కేంద్రాల్లో కేటాయించిన అభ్యర్థుల సంఖ్య, సిట్టింగ్ విధానం, సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూసుకోవాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు డీఎస్పీ సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. డీఎస్పీ వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై శ్రీనివాస్ ఉన్నారు.

మొగుళ్లపల్లి: గ్రూప్ 4 పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ సమ్మయ్య పరిశీలించారు.

చిట్యాల: మండల కేంద్రంలో నేడు(శనివారం) నిర్వహించనున్న గ్రూఫ్‌-4 పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, ఇంటర్ కళాశాల, ఉన్నత పాఠశాల, సాంఘీక సంక్షేమ (వెలుగు) గురుకుల పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10:30 లకు మొదలయ్యే పరీక్షకు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

అందుబాటులో నిరంతర వైద్యసేవలు



తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేటి(శనివారం) నుంచి 24 గంటల నిరంతర వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు వైద్యాధికారి రాజు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 12 గంటల వరకు వైద్య సేవలు కొనసాగుతున్నాయన్నారు. వైద్యుడు, ల్యాబ్ టెక్నిషియన్, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, స్టాఫ్ నర్స్‌లు, ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఉన్న సిబ్బందితోనే విడతల వారికి ఇప్పటికే డ్యూటీలు ఏర్పాట్లకు సిద్ధం చేసి, 24 గంటల వైద్య సేవలు అందించాడానికి జిల్లా వైద్యాధికారులు సిద్ధమైనట్లు తెలిపారు. రాత్రి 8గంటల నుంచి ఉదయం 8 గంటలకు వరకు ఇద్దరు స్టాఫ్ నర్స్, పీహెచ్‌సీ ఏఎన్‌ఎం, స్వీపర్‌లు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే మరో వైద్యుడు, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నిషియన్, కాంట్‌జంట్ వర్కర్, ఇద్దరు వాచ్‌మెన్లను నియామకాలు చేపట్టినున్నట్లు స్పష్టం చేశారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



పూజలు నిర్వహిస్తున్న రాంరెడ్డి

మహదేవపూర్: మండలంలోని ఎలికేశ్వరం గ్రామంలో శుక్రవారం గ్రామ శిల (బొడ్రాయి)విగ్రహ ప్రతిష్ఠపన మహోత్సవం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి దేవతలను సదర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉత్సవ సమితి సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మహ్మద్ అఫిఫా తండ్రి చనిపోయాడు. దీంతో పేదరికం అడ్డుకావడంతో విద్యార్థిని దత్తత తీసుకొని 10వ తరగతి వరకు కావల్సిన ఆర్థికసాయం చేస్తానని ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుడేలి రాజయ్య ఈ సందర్భంగా తెలిపాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కాటారం: మండలంలోని దంతలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా పలు రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై పలు సూచనలు అందించారు. వైద్యులు శ్రీనివాస్, సుజాత, ప్రధానోపాధ్యాయులు నరివెద్ది సత్యనారాయణ, ఉపాధ్యాయులు గోలి సత్యనారాయణ, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళేశ్వరం మండలం ఏర్పాటు చేయాలి

కాళేశ్వరం: రాష్ట ప్రభుత్వం కాళేశ్వరం మండలం ఏర్పాటు చేయాలని శనివారం (నేటి)ఉదయం నుంచి అఖిలపక్షం ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టనున్నట్లు కాళేశ్వరం మండల పోరాట సమితి సభ్యుడు లేతకరి రాజబాపు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాళేశ్వరం, మెట్‌పల్లి(కన్నెపల్లి), బీరసాగర్, మద్దులపల్లి, పలుగుల, కుంట్లం, చంద్రుపల్లి, నాగేపల్లి, అన్నారం, కాటారం మండలంలోని దామెరకుంట, గంగపురి, మల్లారం, గుండ్రాత్‌పల్లి గ్రామాలను కలుపుతూ మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు కాళేశ్వరం బస్టాండ్ వద్ద రిలే దీక్షలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట ప్రభుత్వం కొత్తగా మండలాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో కాళేశ్వరాలయ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో అన్ని వసతులు ఉన్నప్పటికీ మండలంగా ఏర్పాటుకు నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వం గుర్తించి వెంటనే మండలంగా జీఓ జారీ చేయాలని కోరారు.

సాయిచంద్ మృతి తీరనిలోటు



భూపాలపల్లి రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: రాష్ట గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ మృతి తెలంగాణకు తీరని లోటని బీఆర్‌ఎస్ భూపాలపల్లి అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు అన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం బీఆర్‌ఎస్ యూత్ ఆధ్వర్యంలో సాయి చంద్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. సాయిచంద్ మరణవార్త తీవ్రంగా కలచి వేసిందన్నారు. తెలంగాణ ఒక గొప్ప గొంతుకను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, శ్రీకాంత్ పటేల్, యుగేంద్ర చారి, ముత్తు, సుధాకర్, ప్రేమ్, సాయి గౌడ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల(రేగొండ): గిడ్డంగుల కార్పొరేషన్ రాష్ట చైర్మన్, గాయకుడు సాయిచంద్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని సామాజిక రచయితల సంఘం రాష్ట అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రేగొండ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సాయిచంద్ పాటలతో సమాజాన్ని జాగృతం చేసిన వ్యక్తి అని అన్నారు. ఆయన వెంట రణధీర్, రమేష్ ఉన్నారు.

పాండవుల గుట్టలో ప్రత్యేక పూజలు



పాండవుల గుట్టలో రేగొండ గ్రామ ప్రజలు

టేకుమట్ల(రేగొండ): వానలు కురిసి, రైతులు సంతోషంగా ఉండాలని కోరుతూ శుక్రవారం రేగొండ సర్పంచ్ ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, ప్రజలు మండలంలోని పాండవుల గుట్టకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇప్పటికే విస్తారమైన వర్షాలు కురిసే సమయం కానీ ఇప్పటి వరకు వర్షాలు కురియక పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. కావున వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురువాలని కోరుతూ పాండవుల గుట్టకు ప్రజలందరూ చేరుకున్నారని అన్నారు. ఉప సర్పంచ్ గండి తిరుపతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బాకీ కింద జమ చేసుకోవద్దు

మహాముత్తారం: ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద అందజేస్తున్న రైతుబంధు డబ్బులను పాతబాకీ కింద జమ చేసుకోవద్దని శుక్రవారం మహాముత్తారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను రైతులు వేడుకున్నారు. రైతులు రైతుబంధు తమ ఖాతాల్లో జమైనట్లు చూసుకోవడానికి మండలానికి చెందిన కొంత మంది రైతులు బ్యాంకుకు రావడంతో వారి ఖాతాలు హోల్డ్‌లో ఉన్నట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు మేనేజర్ సంతోష్ చాంబర్ వద్దకు వెళ్లి రైతుబంధును పాతబాకీ కింద చూసుకోకుండా ఇచ్చే విధంగా ఖాతాను హోల్డ్‌లో నుంచి తొలగించాలని కోరారు. ఈ విషయమై మేనేజర్ సంతోష్‌ను వివరణ కోరగా సాధారణంగా రైతుల అకౌంట్లు ఓవర్‌డ్యూ ఉండటంతో హోల్డ్‌లో ఉంచడం జరుగుతుందని తెలిపారు. రైతుబంధు జమైన రైతులకు డబ్బులు అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు రైతుబంధు గురించి ఎలాంటి సందేహాలు పడాల్సిన అవసరంలేదన్నారు.